క్లుప్తంగా

జగనన్న సురక్షలో 11 సేవలు ఉచితం



లచ్చన్నపాలెం సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అరుణశ్రీ

మాకవరపాలెం: జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తామని ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు. లచ్చన్నపాలెం సచివాలయంలో బుధవారం వలంటీర్లకు సురక్ష కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు సురక్ష ద్వారా అందిచే సేవలపై అవగాహన కల్పించాలన్నారు. మాకవరపాలెంలో తహసీల్దార్ ప్రసాదరావు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్ ఈవో పీఆర్డీసీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ



రావణాపల్లిలో విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు

గొలుగొండ: రైతులకు ఖరీఫ్‌కు ముందే వరి విత్తనాలు పంపిణీ చేస్తామని వైస్ ఎంపీపీలు సుర్ల బాబ్జి, జక్కు నాగమణి, వ్యవసాయశాఖ సలహా సంఘం చైర్మన్ కొల్లు సత్యనారాయణ తెలిపారు. చోద్యం, జోగుంపేట, రావణాపల్లి గ్రామాల్లో రైతులకు బుధవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. రైతులకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంపిణీకి పశుగ్రాస విత్తనాలు సిద్ధం

రోలుగుంట: మండలంలోని పశువైద్య కేంద్రాల్లో రాయితీపై పశుగ్రాస విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని పశు వైద్యాధికారి నూకేశ్వర్రావు తెలిపారు. రూ. 460 విలువ గల గడ్డి మొక్క జొన్న 5 కిలోల విత్తనాలు రాయితీపై రూ. 345, హైబ్రీడ్ జొన్న రాయితీ పోను రూ. 345, అలసంద రకం రాయితీ విత్తనాలు రూ. 222 ధరకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన రైతులు అవకాశం వినియోగించుకోవాలని తెలిపారు.

విద్యార్థిని వేధించిన వ్యక్తి కోసం పోలీసుల గాలింపు

నర్సీపట్నం: పాఠశాలకు వెళ్తున్న విద్యార్థినిపై గుర్తు తెలియని వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించడంపై తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని టౌన్ సీఐ ఎస్.గణేష్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. పట్టణంలో జెడ్పీ హైస్కూల్ (మెయిన్)లో విద్యార్థిని చదువుతుంది. ఎప్పుడు మాదిరిగానే విద్యార్థిని బుధవారం ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయలుదేరింది. అబిద్‌సెంటర్ నుండి అగంతకుడు బాలిక వెంటపడ్డాడు. పాఠశాల సమీపానికి వెళ్లే సరికి బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో విద్యార్థిని తప్పించుకుని పాఠశాలలోకి పరుగులు తీసింది. విషయాన్ని క్లాస్ టీచర్ దృష్టికి తీసుకెళ్లింది. వెంటనే ఉపాధ్యాయులంతా బయటికి వచ్చి చూసే సరికి అగంతకుడు పరారయ్యాడు. హెచ్ఎం వెంటనే తల్లిదండ్రులకు కబురు పెట్టి జరిగిన విషయం చెప్పారు. ఉపాధ్యాయులు, బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వెంటనే అప్రమత్తమై సిబ్బందిని పాఠశాలకు పంపించి సీసీ కెమెరాలను పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

వడ్డాది పశువుల ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభం

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలం మేజర్ పంచాయతీ వడ్డాదిలో పశువుల ఆసుపత్రి నిర్మాణ పనులను విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ప్రారంభించారు. ఇటీవల వర్షాలకు వడ్డాదిలో శిథిలావస్థలో ఉన్న పశువుల ఆసుపత్రి కూలిపోయింది. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, స్థానిక నాయకుల కృషితో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద బాబు ఆసుపత్రి నిర్మాణానికి రూ. 10 లక్షల నిధులు మంజూరు చేశారు. కోపరేటివ్ అధ్యక్షుడు దొండా సన్యాశిరావు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరి నాగేశ్వరరావు, సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి, సూరి అప్పారావు చేతుల మీదగా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీ-2 గొంపా చినబాబు, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దేవర అప్పారావు, ఎంపీటీసీలు కోరుకొండ లీలావతి రమణ, గోకివాడ రాము తదితరులు పాల్గొన్నారు.

పల్లె ముంగిటకే సంక్షేమ పథకాలు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు
- రూ. 8.70 లక్షలతో పాఠశాల పనులు పూర్తి



ఎం. కోడూరు రోడ్డు పూర్తి కావడంతో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి



చిన కూర్మగిరిలో దివ్యాంగుడికి భరోసా కల్పిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల : పల్లె ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అన్నారు. బుధవారం మండలంలో తాటిపర్తి పంచాయతీ పెదకూర్మనాథపురం, చినకూర్మనాథపురం గిరి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు లబ్ధిని వివరించారు. పెద కూర్మనాథపురంలో ఆర్నెళ్ల మానసిక దివ్యాంగురాలైన గిరి బాలికను అక్కున చేర్చుకుని పింఛను వస్తుందా అని అడిగారు. రావడం లేదని బాలిక తండ్రి లక్ష్మణ్ తెలపడంతో సదరం చేయించి వెంటనే పింఛన్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. గిరిజన దివ్యాంగుడు బి. కిరణ్‌కుమార్‌ను పరిశీలించి సొంత నిధులతో ఆర్థికసాయం అందించారు. చినకూర్మం గ్రామానికి కమ్యూనిటీ భవనం మంజూరు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు ఏర్పాటు చేసిన సీమంతాలు కార్యక్రమంలో పాల్గొని వారిని ఆశీర్వదించారు. చిన్నారులను ఎత్తుకుని అన్నప్రాసన చేశారు. చినకూర్మనాథపురంలో నాడునేడులో పథకంలో భాగంగా రూ. 8.70 లక్షలతో నిర్మించిన పాఠశాలలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ అల్లంగి గౌరీదేవీ, మార్కెట్ కమిటీ చైర్మన్ సానాపతి కొండలరావు, మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లంగి సంజీవరావు, పడాల అప్పల నాయుడు, పడాల చిట్టిబాబు, చింతామూర్తి, సయ్యపురెడ్డి నారాయణరావు, రాఖీ శ్రీను, ఇందుకూరి నాగరాజు, ఎంఈవో బి. దేముడమ్మ, ఓఎస్డీ ఎం. పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పల్లెకు రహదారి నిర్మాణమే లక్ష్యం

నియోజకవర్గంలో ప్రతి పల్లెకు రహదారి నిర్మాణమే లక్ష్యంగా పని చేస్తున్నామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలో ఎం. కోడూరు నుండి ఒకే శ్రీరాంపురం గ్రామానికి రూ. 60 లక్షలతో సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తికావడం, అలాగే పాడేరు మెయిన్ రోడ్డు నుండి చిన కూర్మనాథపురం గిరి గ్రామానికి రూ. 60 లక్షలతో సుమారు రెండు కిలోమీటర్ల నిర్మాణంపూర్తి కావడంతో బుధవారం సాయంత్రం రెండు రోడ్లకు కొబ్బరికాయలు కొట్టి శిలాఫలకాలు ఆవిష్కరించారు.

నెల రోజుల్లో ఇంటింటికీ కుళాయి నీరు అందిస్తాం

- గడప గడపకు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



కరకలో సమస్యలు తెలుసుకుంటున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట : కరక గ్రామంలో నెల రోజుల్లో ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి ఆయన కరకలో ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలిసికున్నారు. వైసీపీ పాలన, పథకాల నిర్వహణ, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు బాగున్నాయని గ్రామస్తులు విప్ ధర్మశ్రీకి వివరించారు. గ్రామంలో ప్రధాన కాలువ శిథిలమైందని, సిమెంట్ కాలువ పనులు చేపట్టాలని, కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, సర్పంచ్ యన్నెంశెట్టి రమణమ్మ, ఎంపీటీసీ గోకివాడ రాము, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పల నాయుడు, జిల్లా యాదవ యువజన సంఘం నాయకుడు జోగా కొండబాబు, అధ్యక్షుడు నమ్మి అప్పలరాజు, చింతపాక సర్పంచ్ గొలజాన శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

నర్సీపట్నం: పేదల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మున్సిపాలిటీ 21వ వార్డు శారదానగర్‌లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. వార్డుకు వచ్చిన ఎమ్మెల్యేకు మహిళలు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ, సమస్యలపై ఆరా తీశారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమయ్యే కీలక పత్రాలను అందిస్తుందని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, వార్డు కౌన్సిలర్ కర్రి విసీల చైతన్య, అయ్యరక కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, కోఆప్షన్ సభ్యుడు లగుడు స్వామి, 16వ వార్డు కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, ఏఎంసీ డైరెక్టర్ సమ, బేతిరెడ్డి విజయ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాడి రైతుకు అండగా విశాఖ డెయిరీ

కె.కోటపాడు : పాడి రైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ ప్రాధాన్యత ఇస్తుందని డైరెక్టర్ సుందరపు గంగాధర్ అన్నారు. చౌడువాడ పాలసంఘం సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇతర పాల సంఘాలకన్నా విశాఖ డెయిరీ సభ్య రైతుల పాలకు మంచి మద్దతు ధర దక్కుతుందని అన్నారు. సొసైటీ పరిధిలో పశు బీమాతో మరణించిన 8 పశువుల యజమానులకు రూ.3 లక్షల 10 వేలు, బీమాతో మరణించిన 11 మంది పాడి రైతుల కుటుంబాలకు రూ.3 లక్షల 30 వేల నగదు చెక్కులను అందించారు. పాల సంఘం అధ్యక్షుడు కోమార వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు కోమార ఎర్రునాయుడు, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై ముమ్మరంగా సర్వే

మాడుగుల రూరల్: శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉన్నట్లయితే వాటిని కుష్టు వ్యాధికి సంకేతాలుగా గుర్తించాలని కేజేపురం పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈవో పి. రామారావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతు కుష్టువ్యాధి పక్షోత్సవాలలో భాగంగా ఈ నెల 26 నుంచి వచ్చే నెల 16 వరకు ఇంటింటి సర్వే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందని, ఈ నేపథ్యంలో వైద్య సిబ్బంది, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు సర్వే చేపట్టి అనుమానిత పేర్లు నమోదు చేసుకుంటున్నారన్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే ఎండీటీ మందు ద్వారా వ్యాధిని అదుపులో ఉంచడం సాధ్యమని తెలిపారు.

గిరి గ్రామాల్లో వైద్య సేవలు అందించండి

మాడుగుల రూరల్ : గిరిజన గ్రామాల్లో పూర్తిస్థాయిలో వైద్య సేవలందించాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వైద్య సిబ్బందికి సూచించారు. వర్షా కాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బుధవారం కూర్మానాథపురంలో కేజేపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ పాత్రుడు ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎంను సత్కరించారు. సర్పంచ్ అల్లంగి వెంకట గౌరీదేవి, మాజీ సర్పంచ్ సంజీవి, ఎంపీహెచ్ఈవో పి. రామారావు, ఆరోగ్య పర్యవేక్షకులు వెంకట్రావు, సహాయకులు నీలాంబరం, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును సత్కరిస్తున్న వైద్యాధికారి ప్రసాద్ పాత్రుడు, సిబ్బంది

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

మాకవరపాలెం: పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి మరువలేనిదని వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి అన్నారు. అమ్మఒడి నగదు విడుదల సందర్భంగా బుధవారం తామరం సచివాలయం వద్ద సీఎం జగన్ ఫ్లెక్సీకి లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. తూర్పు కాపు సంఘం మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు, సర్పంచ్ గొంతిన చెల్లారత్నం, ఉప సర్పంచ్ ప్రసాద్, పీఏసీఎస్ డైరెక్టర్ అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.



తామరంలో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న వైస్ ఎంపీపీ, మహిళలు

గ్రామస్థాయి ధార్మిక జట్లు ఏర్పాటు చేయాలి

మాకవరపాలెం: ధర్మాన్ని కాపాడేందుకు గ్రామస్థాయిలో ధార్మిక జట్లను ఏర్పాటు చేయాలని సమరసతా సేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర ధర్మ ప్రచారక్ ఆడారి గంగాధర్ పిలుపునిచ్చారు. పెద్దమిల్లు జంక్షన్‌లోని వామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఉన్న ధార్మిక జట్లు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడటంలో భాగంగా గతంలో మొదటి విడతగా టీటీడీ ఆధ్వర్యంలో 502 దేవాలయాలు నిర్మాంచారని, ఈ ఏడాది మళ్లీ 320 దేవాలయాలు నిర్మించేందుకు నిధులు విడుదల చేసినట్టు చెప్పారు. జిల్లా, డివిజన్ కన్వీనర్లు, ధర్మ ప్రచారకులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అనేక ఉపయోగాలు

నాతవరం: జగనన్న సురక్షతోప్రజలకు అనేక ఉపయోగాలు ఉన్నాయని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. మండలంలో బుధవారం చెర్లోపాలెం గ్రామంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలిసి ఇంటింటి సర్వే చేపట్టారు. జగనన్న సురక్షలో ప్రభుత్వం సూచించిన విధంగా అర్హత ఉన్న వారందరికి సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చినబాబు, సర్పంచ్ పైల శిరీష, మాజీ సర్పంచ్ మాకిరెడ్డి వెంకటరమణ, వీఆర్వో బాబు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్బీకేల ద్వారా వరి విత్తనాల పంపిణీ



గుల్లేపల్లిలో రైతులకు వరి విత్తనాలు అందిస్తున్న దేముళ్లు, లైలాదేవి

కె.కోటపాడు : స్థానికంగానే ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారానే రైతులకు విత్తనాలు, ఎరువులు అందించనున్నట్లు గుల్లేపల్లి గ్రామ సర్పంచ్ బండారు దేముళ్లు అన్నారు. గుల్లేపల్లిలో బుధవారం రైతులకు వరి విత్తనాలను రాయితీపై అందించే కార్యక్రమంలో ఆయనతో పాటు మండల వ్యవసాయ విస్తరణాధికారిణి లైలాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేముళ్లు మాట్లాడుతు సీఎం జగన్ ఇప్పటికే ఖరీఫ్ సాగులో రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా నగదును రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. గుల్లేపల్లిలో 145 మంది రైతులకు ఆర్‌జీఎల్, సాంబామసూరి, సోనామసూరి, 1121, స్వర్ణ రకం విత్తనాలు అందించినట్లు ఏఈవో లైలాదేవి పేర్కొన్నారు.

ఎం. కోటపాడులో..

మాడుగుల రూరల్: ఖరీఫ్ సీజన్‌కు గాను సబ్సిడీ వరి విత్తనాల పంపిణీ బుధవారం నుంచి ప్రారంభించారు. ఎం. కోటపాడులో గ్రామ సర్పంచ్ శానాపతి శేషఫణి, ఉప సర్పంచ్ శానాపతి గంగాధర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్‌జేఎల్, స్వరణ తదితర వరి విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాల ద్వారా ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఏఏ రాజ్యలక్ష్మి, రైతులు, సహకార సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మాదేవిపేట ఆర్బీకేలో..

మాడుగుల : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. బుధవారం మండలంలో జమ్మాదేవిపేట ఆర్బీకేలో వరి విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మాడుగుల పట్టణంలో సర్పంచ్ ఎడ్ల కళావతి ఆధ్వర్యంలో, కింతలి వల్లాపురంలో సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి ఆధ్వర్యంలో విత్తనాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు ఎం. పొలిమేర విజయలక్ష్మి, పెరుమళ్ల వెంకటరావు, వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు, కుక్కర మహేశ్వరి, జవ్వాది వరహాలు, ఎం.అశోక్, కుక్కర శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి: మండలంలోని పశు వైద్యశాలలతో పాటు రైతు భరోసా కేంద్రాల్లో గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఎం. అలమండ పశు వైద్యాధికారి కె. మంజుష అన్నారు. కాకిజొన్న, మొక్కజొన్న రకాల గడ్డి విత్తనాలు 75 శాతం రాయితీపై అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. 5 కేజీల కాకిజొన్న విత్తనాల బ్యాగ్ రూ. 115, 5 కేజీల మొక్కజొన్న విత్తనాల బ్యాగ్ రూ. 85కు అందిస్తామన్నారు.

కోర్టు ఉత్తర్వుల మేరకు తదుపరి చర్యలు

నర్సీపట్నం: మున్సిపాలిటీలో కోర్టు ఉత్తర్వుల మేరకు తదుపరి చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ కె.కనకారావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీ నుంచి భవన యజమానులకు జారీ చేసిన నోటీసులపై కోర్టు స్టే విధించిందన్నారు. కోర్టు ఉత్తర్వులకు లోబడి రోడ్డు విస్తరణ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

స్టేపై కౌంటర్ దాఖలు చేస్తాం

కోర్టు ఆదేశాలను గౌరవిస్తామని..స్టేపై కౌంటర్ దాఖలు చేస్తామని న్యాయవాది, కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర తెలిపారు. మున్సిపాలిటీ, నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష మేరకు రోడ్డు విస్తరణకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని వంద అడుగులకు రోడ్డు విస్తరణ చేపట్టాలని కౌన్సిల్‌లో ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా గత ఏడాది డిసెంబర్‌లో రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేశారన్నారు. విస్తరణకు సంబంధించి భవన యజమానులకు జారీ చేసిన నోటీసుపై మాత్రమే హైకోర్టు స్టే ఇచ్చినట్లు తెలిపారు. రోడ్డు ప్రక్రియను ఆపమని కోర్టు ఎక్కడా ఆదేశించలేదన్నారు. కోర్టు ఆదేశాలను గౌరవించి వారం రోజుల్లో హైకోర్టులో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు.

దోమల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి

మాడుగుల రూరల్: మలేరియా మాసోత్సవాలలో భాగంగా కేజేపురం పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం గ్రామాల్లో ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ శివ ప్రసాద్ పాత్రుడు ఆధ్వర్యంలో మాడుగులలో బస్టాండు ఆవరణలో మానవహారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి శివప్రసాద్ పాత్రుడు మాట్లాడుతు దోమల వృద్ధి కాకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. ఎంపీహెచ్ఈవో పి. రామారావు, ఆరోగ్య పర్యవేక్షకులు వెంకట్రావు, ఆరోగ్య సహాయకులు శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కింతలి పీహెచ్‌సి పరిధిలో కింతలి, తదితర గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు.

50 సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళిక

నాతవరం: ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేస్తుందని వెలుగు ఏపీఎం మత్రి లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం డ్వాక్రా సంఘాలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ రకాల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి రూ. 2 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తుందన్నారు. మండలానికి ఈ ఏడాది 50 యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యం పెట్టుకోగా ఇంత వరకు 18 యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఆసక్తి ఉన్న డ్వాక్రా మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించి మంజూరుకు కృషి చేస్తున్నామన్నారు. మొదట లింగంపేటలో రూ. 10 లక్షలతో జీడి పిక్కల ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వెలుగు సిబ్బంది వాసు, లక్ష్మి, జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

తారుప్లాంట్‌ను తక్షణం తొలగించాలి

రావికమతం : కొత్తకోటలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన తారుప్లాంట్‌ను తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తూ పలువురు మహిళలు, యువకులు ప్లాంట్ వద్ద, పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేశారు. రోలుగుంట మండలం వెలంకాయపాలెం నుంచి గంధవరం వరకూ రహదారి విస్తరణ పనులు చేస్తున్న ఎస్ఆర్ కనస్ట్రక్షన్ నిర్వాహకుడు జనావాసాల మధ్య తారు, మెటల్ మిక్సింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశాడు. మొదట్లో పెద్దగా పొగ రాకున్నా గడచిన 15 రోజులుగా ప్లాంట్ నుంచి దట్టమైన తారుపొగ వెదజల్లుతోంది. సమీపంలోని ఇళ్లల్లోని జనం ఈ పొగ ధాటికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పొగ వల్ల గుండెలు మండిపోతున్నాయని, దగ్గు విపరీతంగా వస్తోందంటూ నివాశితులు చింతల కిషోర్, లావణ్య, మహాలక్ష్మి, జేవీ వరలక్ష్మి, కోట వీరాస్వామి తదితరులు ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేశారు. ఉప సర్పంచ్ పందల దేవాకు వినతిపత్రం అందించారు.

పేద విద్యార్థులకు వరం అమ్మ ఒడి

రోలుగుంట : అమ్మఒడి పథకం పేదలకు వరం అని నర్సీపట్నం వృక్షమిత్ర వ్యవస్థాపకుడు అప్పన రాంబాబు అన్నారు. ఈ పథకం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ. 6,392.94 కోట్లు వెచ్చించడంపై హర్షం వ్యక్తం చేశారు. డ్రాపవుట్స్ లేకుండా విద్యా వికాసానికి ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

బుద్ధావతారంలో జగన్నాథుడు

మాడుగుల : జగన్నాథ రథోత్సవాలలో భాగంగా బుధవారం జగన్నాథుడు బుద్ధావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గురువారంతో జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు ముగుస్తున్న సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంద్రద్యుమ్నం నుండి తిరిగి ఆలయానికి స్వామివారిని తీసుకెళ్లేందుకు రథాన్ని అలంకరిస్తున్నారు.

సంగీతంతో మానసికోల్లాసం

కె.కోటపాడు : సంగీత శిక్షణతో మానసికోల్లాసంతో పాటు చక్కటి ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీవో కె.శచీదేవి అన్నారు. స్థానిక అయ్యన్న విద్యా సంస్థల్లో బుధవారం నుండి విద్యార్థులకు సంగీతం తరగతులు ప్రారంభించారు. అయ్యన్న విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఖాసిమ్ మాట్లాడుతు విద్యార్థుల్లో సంగీతంపై ఉన్న ఆసక్తిని మరింత మెరుగుపరచాలన్న లక్ష్యంతో సంగీత శిక్షణకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ నూర్జహాన్, ఉపాధ్యాయురాలు మల్లాది సమీరా, ప్రిన్సిపాల్ హరీష పాల్గొన్నారు.